సాక్షి అనకాపల్లి

సోమవారం : 15 : జనవరి : 2024



ఇల వైకుంఠం బల్లిగిరి

విశాఖ: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఇల వైకుంఠాన్ని తలపించింది.



అలరించిన నృత్య ప్రదర్శనలు

విశాఖ: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం జాతరలో శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి.



ఎనలేని అభివృద్ధి

I Iలో

కె.కోటపాడు మండలంలో రూ.2.22 కోట్లతో నిర్మించిన భవనాలు, రోడ్లను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు.

న్యూస్‌రీల్

కమనీయం.. గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో చివరిరోజైన ఆదివారం భోగీనాడు ఉపమాకలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, పి.వి.శేషాచార్యులు స్వామివారి పుష్ప తోటలో శాస్త్రోక్తంగా ఈ వేడుక నిర్వహించారు. ఉదయం కొండపై ఆలయ ఆచారాలు, వైష్ణవ సంప్రదాయం ప్రకారం 30వ పాశురం విన్నపం చేసి, కల్యాణం జరిపించారు. స్వామివారికి పాదప్రక్షాళన, కన్యాదానం, కట్నాలు, శుభముహూర్తం, మంగళసూత్రధారణ, ఆశీర్వచనాలు తదితర తంతు నిర్వహించారు. శ్రీదేవీ భూదేవీ సమేతుడైన స్వామివారిని పుణ్యకోటి వాహనంలోనూ, అమ్మవారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. కల్యాణ కాంతులీనుతున్న స్వామివారు మాడవీధుల్లోకి రావడంతో భక్తులు, కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. టీటీడీ వారు భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేసారు.

తోటకూర గింజలతో నాగలి పట్టిన రైతు



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ తోటకూర గింజలతో నాగలి పట్టిన రైతు చిత్రాన్ని రూపొందించి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపాడు. సోమవారం మకర సంక్రాంతి నేపథ్యంలో 2700 తోటకూర గింజలను వినియోగించి నాగలి పట్టిన రైతు చిత్రాన్ని రూపొందించాడు. ప్రస్తుత కాలంలో ట్రాక్టర్ల రాకతో నాగలి కనుమరుగవడంతో రైతుకూ నాగలికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తయారుచేసినట్టు రవికుమార్ తెలిపాడు.

భర్త హత్య కేసులో నిందితురాలికి రిమాండ్

కశింకోట: బయ్యవరంలో భర్త హత్య కేసులో భార్యను అరెస్టు చేసి ఆదివారం కోర్టులో హాజరు పరచగా, 14 రోజులపాటు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ ఆనంద్‌బాబు తెలిపారు. ఆస్తి కోసం బరుకు గోవింద్‌ను భార్య శివలక్ష్మి (33) శుక్రవారం రాత్రి మద్యంలో పురుగు మందు కలిపి తాగించి హత్య చేసిందనే అభియోగంపై అరెస్టు చేశామన్నారు. అనకాపల్లి 12 ఏఎస్ఎం కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ రిమాండ్ విధించిన మేరకు నిందితురాలిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. శారదానది రైల్వేబ్రిడ్జిపై కశింకోట వైపు నడుచుకొని వెళ్తున్న వ్యక్తిని విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు ఢీకొంది. ఈ ఘటనలో సదరు వ్యక్తి బ్రిడ్జిపై నుంచి కిందపడి మృతి చెందాడు.



సింహగిరిపై రాజగోపురం ఎదురుగా భక్తులు వేసిన భోగిమంట

సంబరాల సంక్రాంతి

- పల్లెల్లో 'పండగ' వాతావరణం
- సొంతూళ్లకు వచ్చిన జనంతో కళకళ
- లాభసాటి పంటలు చేతికందడంతో అన్నదాతల మోముల్లో ఆనందం
- గోవాడ సుగర్స్ రైతుల బకాయిలు చెల్లించడంతో హర్షం
- రైతుల ఖాతాల్లో 'ధాన్యం కొనుగోలు'మొత్తం జమ
- ప్రతి ఇంటా సంక్రాంతి పిండివంటల ఘుమఘుమలు

అందమైన గొబ్బిళ్లు.. ఆనందాల హరివిల్లు.. అనురాగాల పొదరిల్లు.. హరిదాసుల కీర్తనలు.. రంగవల్లుల వాకిళ్లు.. ఊరూ వాడా సందళ్లు

సాక్షి, అనకాపల్లి: అన్నదాత లాభనష్టాల లెక్కలు వేసుకోకుండా సాగు చేస్తాడు.. పంట పండిస్తాడు.. నిస్వార్థంగా అందరి ఆకలి తీరుస్తాడు.. అందుకే వెన్నెముకలాంటి రైతన్న చల్లగా ఉంటే జాతి పచ్చగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయదారులకు మంచి కాలం వచ్చింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడి వాతావరణం అనుకూలించి పంట చేతికొచ్చింది. అనుకున్న దానికన్నా వరి ధాన్యం దిగుబడి పెరిగింది. ఆర్బీకేలు వారికి అండగా నిలిచాయి. రైతు భరోసా పథకం నిజంగానే వారికి కొండంత అండగా ఆదుకుంది. దాంతో రైతుల ఇంట సంక్రాంతి సందడి రెట్టింపు అయింది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల బకాయిలు తీర్చేందుకు ఫ్యాక్టరీ ఖాతాలో ప్రభుత్వం రూ.12.30 కోట్లు జమ చేసింది. వారితోపాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో అందరూ ఆనందంగా ఉన్నారు. పండగ షాపింగ్‌తో దుకాణాలు కిటకిటలాడాయి. సంక్రాంతి పండగలో మొదటి రోజు భోగి మంటలతో.. రెండో రోజు సంక్రాంతినాడు పొంగలి, పిండివంటలతో పితృ దేవతల పూజలతో.. మూడో రోజు కనుమ సందర్భంగా గోపూజలతో సంబరాలను ఆనందంగా నిర్వహించుకుంటారు.

సంక్రాంతి అంటేనే సంప్రదాయాల కలబోత.. ఈ పండగ రోజున ఎక్కడి వారైనా పల్లె బాట పట్టాల్సిందే.. వ్యాపారాలు, చదువులు, ఉద్యోగాల రీత్యా పట్టణాలలో స్థిరపడిన వారందరూ తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. అందుకే గ్రామాలు కళకళలాడుతున్నాయి. శనివారం అర్ధ రాత్రి నుంచే భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. ప్రతి ఇంటా ముత్యాల ముగ్గులు కనువిందు చేశాయి. అన్నదాతలతోపాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండడంతో ఈ ఏడాది పెద్ద పండగ సంబరాలతో హోరెత్తనుంది. ఎక్కడ చూసినా పండగ వాతావరణం కనిపిస్తోంది.

సుఖ సంతోషాలు వెల్లివిరియాలి



తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ వేళ ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలి. నవరత్న పథకాలతో సంక్షేమ కాంతులు నింపిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో తులతూగాలి.

– ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

సంక్రాంతి శుభాకాంక్షలు



హిందూ సంప్రదాయ పండగల్లో అత్యంత ముఖ్యమైన మకర సంక్రాంతిని ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలి. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే పండగ సంక్రాంతి. ప్రతి ఇల్లు సిరిసంపదలు, సౌభాగ్యాలతో కళకళలాడాలి.

– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా కలెక్టర్

పులకించిన సింహగిరి



హరిదాసు, గంగిరెద్దు,కొమ్మదాసరి, జంగం దేవర ప్రదర్శన

సింహాచలం: సింహగిరిపై సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి దర్శనంతో పాటు సంక్రాంతి సంబరాలు కూడా ఒకే చోట చూసే భాగ్యం తమకు దక్కిందని ఆనంద భరితులయ్యారు. విశాఖ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి సంబరాలను ప్రారంభించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటను స్వరూపానందేంద్ర సరస్వతి వెలిగించారు. భోగి పిడకలు మంటలో వేశారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, అధికారులు, సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

విశేషంగా ప్రదర్శనలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సింహగిరి మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గొబ్బెళ్ల ముత్యాల ముగ్గులు, చెరుకు గెడలు, ఎడ్లబండి, నాగళ్లు, గడ్డిమోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ఎద్దులబండి, కుమ్మరి చేసే మట్టి వస్తువులను భక్తులు తిలకించారు. జంగం దేవర, కొమ్మదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్దు విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధాన్యం గుట్టలవద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. స్వామివారి ఆలయాన్ని, సింహగిరి మాడ వీధులను విశేషంగా అలంకరించారు. రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వరాహస్వామి ఆర్ట్ విశేషంగా ఆకట్టుకుంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పతంగుల పండగ



సీఎం ముఖచిత్రంతో తయారు చేసిన పతంగులను ఎగురవేస్తున్న దృశ్యం

అనకాపల్లి: సంక్రాంతి సందర్భంగా ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖచిత్రంతో తయారు చేసిన పతంగులను ఎగురవేశారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరికి భగవంతుడు భోగభాగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు 150 హాట్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పందెం కో‘ఢీ’



- తగ్గేదేలే... అంటున్న గ్రామీణవాసులు
- సంక్రాంతికి సిద్ధమైన పందెం కోళ్లు
- తెలుగు సంప్రదాయంలో భాగమేనంటున్న పల్లెవాసులు
- కోడిపందేల స్థావరాలపై నిఘా

సాక్షి, అనకాపల్లి: కోడి పందాలకు పోలీసులు ససేమిరా అంటున్నా.. నిర్వాహకులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో పందెం కోళ్లకు విపరీతంగా డిమాండ్ ఉంటుంది. సంక్రాంతి నేపథ్యంలో రహస్య ప్రాంతాల్లో కోడిపందాలు జరుగుతున్నాయి. పందెం నిర్వాహకులు సంక్రాంతికి ఆరునెలల ముందు నుంచే శిక్షణ ఇస్తూ.. పోషకాహారం పెడుతూ పెంచుతున్నారు. కోడి పందాలు తెలుగు సంప్రదాయంలో భాగమేనని పల్లెవాసులు అంటున్నారు. నిషేధం ఉన్నా గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించుకునేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు.

పోలీసుల డేగ కన్ను

కోడిపందాల స్థావరాలపై 'ఖాకీ'లు డేగ కన్ను వేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రహస్య స్థావరాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నందున అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఫిర్యాదు చేసేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్‌ను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం, అనకాపల్లి, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల, కె.కోటపాడు, పెందుర్తి, సబ్బవరం మండలాల్లోని కోడిపందాలు జరుగుతుంటాయి. గతంలో గుర్తించిన స్థావరాలపైన, పందెంరాయుళ్ల కదలికలపై నిఘా ఉంచారు. కోడిపందాల నిర్వహణకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను కూడా రంగంలోకి దింపుతున్నారు.

కోడిపందాలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు



కోడిపందాల నిర్వహణ చట్టవిరుద్ధం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జిల్లాల్లో ఎస్ఈబీ, లా అండ్ ఆర్డర్ పోలీసులతో నిఘా పెంచాం. కోడిపందాలను అడ్డుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలకే పరిమితం కావాలి. పందాలు కట్టడం, కత్తులతో కోళ్లను హింస పెట్టడం తగదు. కోడి పందాలు నిర్వహించుకోవడానికి స్థలం ఇవ్వడం కూడా చట్టరీత్యానేరంగానే పరిగణిస్తాం.

– మురళీకృష్ణ, ఎస్పీ

కోడి పందాలు నిర్వహించడం జంతు హింస చట్టం ప్రకారం పూర్తిగా నిషిద్ధమని పశు సంవర్ధక శాఖ జేడీ ప్రసాదరావు చెప్పారు.

పందెం ఎడ్లు పరుగుకు సిద్ధం

ఎడ్లబళ్ల పోటీలతో పల్లెల్లో సందడి



పోటీలను ఉత్సాహంగా తిలకిస్తున్న ప్రజలు (ఫైల్)

చోడవరం/మాడుగుల: పల్లె జనానికి సంక్రాంతి పండగ వచ్చిందంటే ఇక సందడే సందడి. గ్రామాల్లో పూర్వీకుల నుంచి సంక్రాంతి పండగ రోజుల్లో కొన్ని పందాలు క్రీడా స్ఫూర్తితో కొన్ని పోటీలు మాత్రం నేటికీ ఒక సంప్రదాయంగానే నడుస్తున్నాయి. వీటిలో ప్రధానంగా ఎడ్లబళ్ల పందాలు, కోడిపందాలు, గుర్రపు పందాలు పల్లెల్లో సంక్రాంతి శోభను తెస్తాయి. కోడిపందాలపై నిషేధం విధించడంతో సంక్రాంతి పండగంతా ఎడ్ల బళ్ల పరుగు పందాల వైపే ఆసక్తిగా చూస్తుంది. ఉమ్మడి జిల్లాలో భోగి పండగ నుంచి ఈ పందాలు ప్రారంభమవుతాయి. హింస, జూదానికి తావు లేకుండా కేవలం ఆటవిడుపుగా ఉల్లాసంగా ప్రతి ఒక్కరిలోనూ ఆనందాన్ని నింపే విధంగా గెలుపే లక్ష్యంగా నిర్వహించే ఈ ఎడ్లబళ్ల పరుగుల పోటీలు క్రీడాస్ఫూర్తితో జరుగుతాయి. అందుకే ఈ పోటీలకు ప్రజల నుంచి విశేష స్పందనం ఉంటుంది. అంతేకాదు ఈ పందాలు లేకుండా తీర్థాలు ఊహించలేము అంటే ఈ పోటీలకు ఎంత ప్రాధాన్యముందో అర్థమవుతోంది.

రైతుల్లో ఎంతో ఉత్సాహం

ఎడ్లబళ్ల పందాలంటే రైతులకు, వారి కుటుంబాలకు ఎంతో ఇష్టం. పందాలు ఎక్కడ జరిగినా వాటిని తిలకించేందుకు వెళ్తారు. పందెంలో ఎద్దులు పరుగెత్తే సమయంలో చప్పట్లు కొడుతూ వాటిని మరింత ఉత్సాహపరుస్తూ పరవశం చెందుతారు. ఈ పందాలు నిర్వహించేటప్పుడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తారు.

పోటీలో పాల్గొనే ఎడ్లబళ్లు

మేలుజాతి హుషారైన ఎద్దులను ఈ పందాలకు దించుతారు. పందెం సమయంలో బండి బోల్తాపడిన ఎద్దులకు గానీ ఎవరికీ పెద్దగా ప్రమాదం కలుగజేయకుండా ఉండే తేలికపాటి బళ్లను ఉపయోగిస్తారు. తేలికగా ఉండి ప్రత్యేకంగా బేరింగ్‌లు వేసిన చక్రాలను ఈ బళ్లకు ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పందెంలో బోల్తాపడిన వెంటనే నిర్వాహకుడు బండి ఒక్కడే లేపి తిరిగి పందెంలో పరుగులు తీసే విధంగా అత్యంత తేలికగా ఈ బండిని తయారు చేయడం విశేషం.

పందెం ఎడ్లకు తర్ఫీదుతోపాటు మేత

దేశవాళీతోపాటు కర్ణాటక వంటి రాష్ట్రాల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెచ్చించి ఎడ్లను కొనుగోలు చేసి తీసుకువస్తారు. జాతి ఎద్దులకు రోజూ ఒక జతకు 8 కేజీల ఉలవలతో కూడిన దాణా, ఎండు గడ్డి పెడతారు. రోజుకొకసారి గ్రౌండ్‌లో తర్ఫీదు ఇస్తారు.

పెంపకానికి భారీగా ఖర్చు



పొలం పనులకు ఎద్దులను వాడటంతోపాటు పందాలపై ప్రధానంగా దృష్టి పెట్టి మేలు జాతి ఎద్దులను పెంచుతున్నాను. నా దగ్గర రెండు జతల మేలు జాతి ఎద్దులు ఉన్నాయి. వీటి పెంపకానికి రోజూ భారీగానే ఖర్చవుతుంది. నా ఎద్దులు జిల్లా, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం బహుమతులు గెలుచుకున్నాయి.

– లెక్కల సత్తిబాబు, లెక్కలవానిపాలెం, చోడవరం

పరుగులు తీస్తుంటే ఆనందం



వ్యవసాయంలో నాతో కలిసి జీవించే ఎద్దులు పందాల్లో పరుగులు తీస్తుంటే ఆ ఆనందం చెప్పలేను. వీటి పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకొంటాను. మంచి పోషకాహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత చాలా అవసరం. నాకు రెండు జతల ఎడ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు అనేక పందాల్లో బహుమతులు సాధించాయి.

– మజ్జి దేవానంద్, ఎడ్ల బండి యజమాని, చుక్కపల్లి, చీడికాడ మండలం

ప్రమాద బాధితునికి రూ.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15 లక్షలు మంజూరైందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. ఈ నెల 3న అడ్డురోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదంలో నర్సింహమూర్తి గాయపడిన విషయం తెలిసిందే. ఇతను ప్రస్తుతం విశాఖ నగరం ఆరిలోవ ఎంజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలకు, చెస్ట్‌కు, పక్కటెముకలు విరిగిపోయి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి పది రోజుల నుంచి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్య ఖర్చుల కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు విడుదల చేశారని, ఈ మేరకు ఉత్తర్వులు కాపీని నర్సింహమూర్తి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు.


బాధిత కుటుంబ సభ్యులకు ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

రుణాల మాయాజాలంలో ఏపీఎం, సీసీల సస్పెన్షన్

తుమ్మపాల: నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి రుణాలుగా రూ.7 కోట్ల మాయాజలం చేసిన కేసులో సూత్రధారులుగా గుర్తించిన అనకాపల్లి ఏపీఎం నీలాచలం, సత్యనారాయణపురం, గుండాల వీధి సీసీలు కొండబాబు, పీవీజీకే నాయుడులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విచారణ అధికారి, ఉమ్మడి జిల్లా డీఆర్‌డీఏ పీడీ శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. మహిళల పేర్లతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయడం, వారికి తెలియకుండా బ్యాంకుల్లో కోట్ల మేర రుణాలు పొందడంపై పలు ఫిర్యాదులు, నిరసనల నేపథ్యంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి విచారణకు ఆదేశించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకున్నట్టు ఆదివారం ఆమె తెలిపారు.

సీఎం జగన్ పాలనలో ఎనలేని అభివృద్ధి

- సంక్షేమంతో మెరుగ్గా పేదల జీవన ప్రమాణాలు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ.2.22 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం


గొట్లాంలో రిబ్బన్ కట్ చేసి సీసీరోడ్డు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


సూదివలసలో మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలోనే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని గొట్లాం, సూదివలస గ్రామాల్లో రూ.2.22 కోట్లతో నిర్మించిన పలు భవనాలను, రోడ్లను ఆదివారం ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. మహిళా కోలాటాల నడుమ సందడిగా సాగిన ఈ ప్రారంభోత్సవాలతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. గొట్లాంలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు, సూదివలసలో రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21.40 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ భవనం, రూ.43.90 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.10 లక్షలతో సీసీరోడ్డు, జలజీవన్ మిషన్ నుంచి రూ.60 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. వీటిని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సీఎం జగన్ సంపూర్ణ సహకారంతో మండలంలో అన్ని గ్రామాలను సమాన ప్రాతిపాదికన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధితోపాటు సంక్షేమంతో పేద కుటుంబాల్లో జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడినట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో వలే కాకుండా ప్రజలకు పారదర్శకంగా, అవినీతి లేని సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, సర్పంచ్‌లు ఆదిరెడ్డి సన్యాసినాయుడు, గంతకర్ల చిన్నమ్ములు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, బండారు ముత్యాలనాయుడు, గంతకర్ల సతీష్, ఆదిరెడ్డి వెంకటరావు, గొర్రుపోటు వెంకటరావు, ఉప సర్పంచ్ పిల్లా శ్రీను, కంచిపాటి అప్పలనాయుడు, కోట్యాడ ఈశ్వరరావు, కిలపర్తి సత్యంనాయుడు, మాజీ సర్పంచ్ యాళ్ల సింహాచలంనాయుడు, మండల ఇంజనీర్ బాలాజీ అప్పారావు, మాజీ సర్పంచ్ గంతకర్ల గంగునాయుడు పాల్గొన్నారు.



మార్కెట్‌కు సంక్రాంతి కళ

సాక్షి, అనకాపల్లి: సంక్రాంతి శోభతో జిల్లా అంతటా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. కొనుగోళ్లు, అమ్మకాలతో రద్దీగా, సందడిగా కనిపిస్తున్నాయి. అనకాపల్లి పట్టణంలో వినియోగదార్లను ఆకట్టుకోవడానికి వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ షాపులు, షాపింగ్ మాల్స్‌లను విద్యుద్దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వస్త్రాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు ఆభరణాలు, ఇతర సరకులు కొనుగోళ్ల కోసం జనం పోటెత్తారు. ఖాతాదార్లను ఆకట్టుకోవడానికి వ్యాపార సంస్థలు ఇప్పటికే పలు ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసిన వారికి కార్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు, గోల్డ్ కాయిన్స్ వంటివి కూడా లక్కీ డీప్ ద్వారా గెలుపొందిన వారికి ఇస్తామని పలుచోట్ల బోర్డులు పెట్టాయి. వీటికి ఆకర్షితులై అవి ఎలాంటి ఆఫర్లో ఆరా తీయడానికి కొందరు, కొనుగోళ్లకు మరికొందరు ఎగబడ్డారు. గడచిన కొన్ని రోజులకంటే భోగి పండుగ రోజైన ఆదివారం నగరంలో రద్దీతో పాటు అమ్మకాలు, కొనుగోళ్ల పలు రెట్లు అధికమైంది. దీంతో వాహనాలు, కొనుగోలుదార్లతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఎక్కడికక్కడే ట్రాఫిక్ జామ్ ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరునికి భోగి పూజలు

- ఘనంగా ప్రారంభమైన సంక్రాంతి మొదటి తీర్థం
- కిటకిటలాడిన కూరగాయల తీర్థం


చోడవరం విఘ్నేశ్వరాలయం వద్ద తీర్థంలో సందడి


స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద జనంతో కిటకిటలాడిన కూరగాయల తీర్థం


భోగి మంటల వద్ద కుటుంబ సభ్యులతో విప్ ధర్మశ్రీ

చోడవరం: ఒక పక్క భోగి మంటల సందడి, మరో పక్క సంక్రాంతి తీర్థాలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో హడావుడి నెలకొంది. ఆదివారం భోగి పండగ రోజు నుంచే తీర్థాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే అంతా వాడవాడలా భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నపిల్లలకు చిక్కులు తొలగిపోవాలంటూ భోగిపండ్లు వేసి వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. భోగి పండగ పురస్కరించుకొని ఇక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణమంతా కిటకిటలాడింది. ప్రత్యేక క్షీరాభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో తిరువీధోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సంక్రాంతి సందర్భంగా మొదటి తీర్థం స్వామివారి ఆలయం వద్ద జరిగింది. గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టే బెలూన్లు, పిండివంటలు, పంచదార చిలుకలు అమ్మడంతో వాటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపారు. రంగులరాట్నాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం నెలకొంది. మొదటి తీర్థం కావడంతో పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు.

కిక్కిరిసిన కూరగాయల తీర్థం

జిల్లాలో ఎక్కడా లేని విధంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కూరగాయల తీర్థం సందడిగా జరిగింది. సంక్రాంతి పండగలో రైతులు పండించిన కొత్త పంటలే ముఖ్యం కావడంతో వాటిని ఇక్కడ విక్రయించారు. మెయిన్‌రోడ్డుతోపాటు ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, సినిమాహాలు జంక్షన్ అన్ని ప్రదేశాలు కూరగాయల దుకాణాలతో నిండిపోయింది. వీటిని కొనుగోలు చేసి సంక్రాంతి రోజున పూజ చేస్తే మంచి జరుగుతుందని ప్రతీతి. అందుకే ఇక్కడ కూరగాయలు కొనేందుకు వేలాది మంది జనం తరలిరావడంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి.

విప్ ధర్మశ్రీ భోగి పండగ

భోగి పండగను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన కుటుంబ సభ్యులతో ఆదివారం తన స్వగ్రామమైన కేజేపురంలో సందడిగా జరుపుకున్నారు. భోగి మంటలు వేసి అందరితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రామాలయంలో భజనలు, కీర్తనలు ఆలపించారు.

పట్టుదలతోనే విజయాలు

- ఉత్తరప్రదేశ్ సీబీసీఐడీ అడిషినల్ డీజీ సత్యనారాయణ


మాట్లాడుతున్న డీజీ సత్యనారాయణ

మాకవరపాలెం: పట్టుదలతోనే విజయాలను సొంతం చేసుకోవచ్చని ఉత్తరప్రదేశ్ సీబీసీఐడీ అడిషినల్ డీజీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కొండలఅగ్రహారంలో ఇమ్మానుయేలు జనరల్ ఆస్పత్రితోపాటు ఇక్కడ నర్సింగ్ కళాశాలను ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ చదువుకున్నా, ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా, సమాజ సేవ చేయడంలో ముందుండాలని సూచించారు. లక్ష్య సాధనలో పట్టు వదలకుండా శ్రమించాలన్నారు. నర్సీపట్నం గ్రంథాలయంలో రూ.2 లక్షలతో పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందించానని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్ సంస్థ డైరెక్టర్ బిషప్ కె.జీవన్ రాయ్, గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సంజీవరావు, జ్యోతీబా పూలే ఆలిండియా ఓబీసీ సంఘం అధ్యక్షుడు పోతల ప్రసాద్ పాల్గొన్నారు.

కొమిరలో సొరంగం

- ఇంటింటి కుళాయి పనులు చేస్తుండగా బయటపడ్డ వైనం


లోతుగా ఉన్న సొరంగం పై భాగం

రావికమతం: మండలంలోని కొమిర గ్రామంలో ఊర మెట్ట సమీపంలో సొరంగం బయట పడింది. దీంతో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల వారు చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సర్పంచ్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు పైపులైన్ పనులు చేస్తుండగా, ఒక్కసారిగా భూమి లోపలికి మట్టి పోతుండటంతో జేసీబీ ఆపరేటర్‌కు అనుమానం వచ్చింది. వెంటనే ఆ భాగంలో అడ్డంగా ఉన్న రాయిని తొలగించగా లోతైన గొయ్యి, దాని కింద భాగంలో తూర్పు వైపునకు మలుపు తిరిగినట్టుగా సొరంగం కనిపించింది. దీంతో పొడవైన తాడు సహాయంతో ఒక కూలీని దింపగా 20 అడుగుల వరకు వెళ్లి ఆపై చీకటిగా ఉండటంతో భయంతో వెనక్కి వచ్చేశాడు. గ్రామ సర్పంచ్ ఈ విషయాన్ని ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావుకు, ఉన్నతాధికారులకు తెలియజేశారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు



కశింకోటలో రథంపై లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఊరేగింపు

కశింకోట : కశింకోటలోని లక్ష్మీనృసింహ స్వామి తిరు వీధి ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. భోగి పండగ పురస్కరించుకొని స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం కూడా స్వామి వారి తిరువీధి సేవ జరగనుంది.

పతంగుల సందడి



పతంగులతో చిన్నారులు, క్లబ్ సభ్యులు

అనకాపల్లి: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భోగిపండగను పురస్కరించుకొని పట్టణంలో పతంగుల వేడుకలు జరిగాయి. పెద్దసంఖ్యలో చిన్నారులు హాజరై గాలిపటాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ ఎ.కాసన్న, అధ్యక్షుడు కె.సాయికిశోర్, కార్యదర్శి డి.రత్నాజీరావు, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

బంగారం, వెండి చోరీపై ఫిర్యాదు

అనకాపల్లి : మండలంలో కొత్తూరు నర్సింగరావుపేటకు చెందిన కశ్లపల్లి దేవి ఇంట్లో ఈనెల 12న చోరీ జరిగింది. ఈ చోరీలో ఐదున్నర తులాల బంగారం, 50 తులాల వెండి చోరీకి గురైనట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గ్రామీణ పోలీసులు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

అనకాపల్లి: మండలంలో కూండ్రం శివారున పేకాటస్థావరంపై గ్రామీణ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.28,110 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆనందోత్సాహాలతో భోగి



నూకాంబిక ఆలయంలో హరిదాసులకు బియ్యం అందిస్తున్న ఆలయ చైర్మన్ మురళీకృష్ణ



భోగిమంటకు నమస్కరిస్తున్న ఎంపీ సత్యవతి దంపతులు



భోగలింగేశ్వర ఆలయంలో భోగిమంటను ప్రారంభిస్తున్న చైర్మన్ నాగేశ్వరరావు



కామాక్షమ్మ ఆలయంలోవృద్ధురాలికి బియ్యం, చీర అందిస్తున్న జేజిబాబు



కశింకోటలోని పెద్ద గుమ్మం వీధిలో భోగి మంట కాగుతున్న స్థానికులు



పేదలకు తువ్వాళ్లు అందిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు



చిన్నారులను ఆశీర్వదిస్తున్న సోహం ఆశ్రమ నిర్వాహకులు

అనకాపల్లి : ప్రతి ఒక్కరికి భోగభాగ్యాలు ప్రసాదించాలని భగవంతుడ్ని ఎంపీ బీవీ.సత్యవతి ప్రార్థించారు. ఎంపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం భోగి మంటలు వెలిగించి కుటుంబసభ్యులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. సంక్రాంతి నుంచి అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో తులతాగాలని ఆకాంక్షించారు. హరిదాసులు, గంగిరెద్దులవారికి బియ్యం, వస్త్రాలు సమర్పించారు.

- నూకాంబిక అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రంగవల్లులతో ఆలయ ఆవరణను అలకరించారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ భోగిమంటను ప్రారంభించి హరిదాసులకు బియ్యం అందజేశారు. ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.
- సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు అర్చకుల వేదమంత్రాల నడుమ భోగిమంటను ప్రారంభించారు. అర్చకులు కాశీవిశ్వేశ్వరస్వామి వద్ద పూజించిన కండువాతో నాగేశ్వరరావును సత్కరించారు. ధర్మకర్తలు కృష్ణంరాజు, తాతయ్యలు, త్రినాథ్ పాల్గొన్నారు.
- కామాక్షమ్మ ఆలయ ఆవరణలో విశ్వబ్రాహ్మణసంఘ జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబులు నిరుపేదలకు బియ్యం, వస్త్రాలు అందజేశారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని పేదలకు తువ్వాళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. బట్లపూడి సోహం ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చిన్నారులను ఆశీర్వదించారు.

కశింకోట: కశింకోటలోని గవరపేట, కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి, పూసర్ల వీధి, సత్తెమ్మ కాలనీ, హౌసింగ్ కాలనీలో యువకులు భోగి మంటలు వేశారు.

దివ్యాంగుల ఆత్మస్థయిర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీరాం

అనకాపల్లి: దివ్యాంగుల ఆత్మస్థయిర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వ్యాపారి కాండ్రేగుల శ్రీరాం అన్నారు. తన నివాసంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘ వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్, కార్యదర్శి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, దూళి శివ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

అనకాపల్లి : విజయరామరాజుపేట విజయ గౌరీ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ప్రారంభించారు. పండగల్లో ఇటువంటి పోటీల ద్వారా మహిళలల్లో ఉత్సాహం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఆళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

అదుపుతప్పి ద్విచక్రవాహనం బోల్తా



ప్రమాద స్థలంలో గాయపడిన ఏసురాజు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

రోలుగుంట: కొత్తకోట -రోలుగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డులో కంచుగుమల కూడలి వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న కొంతలం గ్రామానికి చెందిన కేశరపూడి ఏసురాజు(18) తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన శామ్యూల్‌గా పిలవబడే ఏసురాజు కొత్తకోట వెళ్లి అక్కడ నుంచి రోలుగుంట వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. గాయపడ్డ వ్యక్తిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఎల్.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



కశింకోట : గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మినారాయణ హోమం



కశింకోట: వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం

కశింకోట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథుని ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో అర్చకుడు రేజేటి చరణాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం జరిపారు. గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. సాయంత్రం గోదాదేవి కల్యాణోత్సవం జరిపారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.

హరిదాసులను ప్రభుత్వం ఆదుకోవాలి



హరిదాసు అప్పారావును సత్కరిస్తున్న కుమారస్వామి

అనకాపల్లి : హరిదాసులను ప్రభుత్వాలు ఆదుకోవాలని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. స్థానిక విజయరామరాజుపేటలో ఆదివారం హరిదాసు అప్పారావును ఘనంగా సత్కరించి మాట్లాడారు. ధనుర్మాసోత్సవాల ప్రారంభం నుంచి 30 రోజులపాటు హరిదాసులు ప్రతివీధిలో హరినామస్మరణతో తిరుగుతూ ప్రజలను మేలుకొలుపుతారన్నారు. వచ్చే ఏడాది వరకు ఎటువంటి ఉపాధి లేక వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పేట గ్రామ కమిటీ సభ్యులు పలకా రాము, పలకా సత్యనారాయణ, పిట్ల బుద్దీశ్వరరావు, పలకా కాసులు, పలకా నాగేశ్వరరావు, వినాయక దేవాలయం అర్చకుడు సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కశింకోట: కశింకోటలోని ద్వారపురెడ్డి వారి వీధిలోని కల్యాణ మండపంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష ఆదరణ లభించింది. అర్హులైన 43 మంది రక్తదానం చేశారు. వివేకానంద విజ్ఞాన పరిషత్,విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వివేకానంద విజ్ఞాన పరిషత్ గౌరవాధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అధ్యక్షుడు గుమ్మాల శ్రీనివాసబాబు, ప్రధాన కార్యదర్శి హరనాథ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

సినీ రంగానికే గ్లామర్ అద్దిన శోభన్‌బాబు



సంస్థ కార్యాలయంలో పేదలకు వస్త్రాలు అందజేస్తున్న నాగభూషణం



విజయరామరాజుపేటలో శోభన్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

అనకాపల్లి : సినీ రంగానికి గ్లామర్ తీసుకొచ్చిన ఘనత నటభూషణ్ శోభన్‌బాబుదే అని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం శోభన్‌బాబు 87 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని నిరుపేదలకు వస్త్రాలు అందజేశారు. కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, కొత్తుర్తి రామారావు, రొబ్బి మల్లేశ్వరరావు, చంద్రరావు పాల్గొన్నారు. విజయరామరాజుపేట ఆలిండియా శోభన్‌బాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో శోభన్ జయంతి వేడుకలు జరిగాయి. సంఘ అధ్యక్షుడు ముగడ అప్పారావు శోభన్‌బాబు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆళ్ల శివ రామ సత్యనారాయణ, పలకా రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి



సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రవి

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఉత్తరాంధ్రజిల్లా కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ కార్యాలయంలో ఆయనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పని చేసేవారికి పదవులు వాటంతటవే వస్తాయని సూచించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్రపరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ.సత్యవతిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సంతోష్ అప్పారావునాయుడు, సభ్యులు

అనకాపల్లి: గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్‌అప్పారావు చెప్పారు. ఆలయ ఆవరణలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే ఉత్సవంలో నేలవేషాలు, స్టేజీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 24న మధ్యాహ్నం అమ్మవారి సారె ఊరేగింపు, రాత్రి అమ్మవారి కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో 26న విశాఖ ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. ఉత్సవం గోడపత్రికను ఆవిష్కరించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



అనకాపల్లి : స్థానిక గాంధీనగరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణవేడుకలు కమనీయంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు ఓబులరెడ్డి దంపతులతో కల్యాణ వేడుకలు జరిపించారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగలి నివేదించారు. కల్యాణ వేడుకలకు వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి హాజరై తిలకించారు. అన్నసమారాధన చేపట్టారు.





